క్లుప్తంగా

వీణా విద్వాంసురాలికి సన్మానం



స్వామివారి ప్రసాదం అంజేస్తున్న అర్చక స్వామి

నల్లకుంట: విజయ దశమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం భద్రాచలం రామయ్య సన్నిధిలో నిర్వహించిన చండీహోమంలో నల్లకుంటకు చెందిన ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వాములు శాంతామూర్తిని సన్మానించి స్వామి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం విద్యార్థి ముడావత్ వాల్యాకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి పర్యవేక్షణలో ట్రైబల్ డెవలప్‌మెంట్ సబ్-ప్లాన్ స్కీమ్స్ ఇన్ తెలంగాణ స్టేట్ ఎ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఇఫ్లూ వీసీ ప్రొ.సురేష్‌కుమార్ పరిశోధనకు సహకరించినట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌పీ పోటీ

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాలకు పోటీ చేయనున్నట్లు తెలంగాణ రిపబ్లికన్ పార్టీ (టీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షులు నక్క యాదీశ్వర్ పేర్కొన్నారు. తెలంగాణ అమరుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు టీఆర్‌పీ కృషి చేసేందుకు ఎన్నికల్లో పోటీ చేయాలని మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. ఉత్సాహవంతులైన తెలంగాణ ఉద్యమకారులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు, మహిళలు, యువత, కార్మికులు, ఇతర వర్గాల జనాబా ప్రాతిపదికన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు.

మూగజీవాలకు ఆహారం



ఆహారం పెడుతున్న ప్రొ.చంద్రునాయక్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ ప్రొ.చంద్రునాయక్ క్యాంపస్‌లో జీవిస్తున్న మూగజీవాలకు ప్రతి రోజు ఆహారాన్ని అందిస్తున్నారు. క్యాంపస్‌లో సంచరిస్తు న్న కుక్కలు, పావురాలు, వివిధ రకాల పక్షులకు 2 001 నుంచి ఆహారాన్ని అందచేస్తున్నట్లు చెప్పారు. ప్రతి రోజు రూ.300 చొప్పున నెలకు రూ.9 వేలను మూగజీవాల ఆహారానికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

సిలిండర్ పేలి .. గృహోపకరణాల దగ్ధం

సైదాబాద్: దసరా సందర్భంగా ఇంట్లో పిండివంటలు వండుతుండగా సిలిండర్ పేలి అగ్నిప్రమాదం సంభవించింది. సైదాబాద్ పోలీసుల కథనం ప్రకారం... ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో నివసించే శశికళ స్థానికంగా కిరాణాషాపు నిర్వహిస్తోంది. పండుగ సందర్భంగా సోమవారం రాత్రి ఇంట్లో ఆమె పిండివంటలు వండుతోంది. సిలిండర్‌లోని గ్యాస్ అయిపోవడంతో వేరే సిలిండర్ బిగిస్తుండగా హఠాత్తుగా పేలింది. దాంతో ఇంట్లో మంటలు వ్యాపించాయి. భయంతో శశికళ సహా ఇంట్లోని వారు బయటకు పరుగు తీశారు. వెంటనే స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపకం సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో అక్కడకు చేరుకొని మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని, ఇంట్లోని పలు గృహోపకరణాలు దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు.

సాయి భక్తుల భిక్షాటన

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో పది రోజులుగా షిరిడీ సాయి 105వ మహాసమాధి పుణ్యతిధి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో బాగంగా మంగళవారం ఉదయం సాయిబాబాకు 108 వెండి కలశాలతో పవిత్ర నదీ జలాలు, ఆవుపాలతో అష్టోత్తర శత కలశాభిషేకం, నిర్వహించారు. 108 బంగారు పుష్పాలతో సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అనంతరం భక్తులు భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ జి. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌కు ఘన చరిత్ర

ఎన్నికల నేపథ్యంలో సింహావలోకనం



ముషీరాబాద్: నియోజకవర్గానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఎన్నో ఉద్యమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రభుత్వ కార్యాలయాలు, పెద్ద పెద్ద పరిశ్రమలకు నెలవుగా ఉంది.

◆ ముషీరాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ముషీరాబాద్ చరిత్ర గురించి పాఠకులకు, ప్రజలకు అవగాహన కోసం... ప్రపంచం, దేశం, రాష్ట్రంలో ఏ మూలనా అన్యాయం జరిగిన గొంతెత్తి నినదించేది ఇక్కడే.

◆ బలమైన తమ నిరసన తెలియజేసే ధర్నాచౌక్, ఆర్టీసీక్రాస్ రోడ్స్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం వంటివి ఎన్నో వారిని అక్కున చేర్చుకుంటున్నాయి.

◆ తుదిదశ తెలంగాణ ఉద్యమం, సాగరహారం, మిలియన్ మార్చ్‌లకు ముషీరాబాద్ సాక్షిగా నిలిచింది.

◆ వామపక్ష ఉద్యమ పార్టీలు ప్రజా సంఘాలకు ముషీరాబాద్ అడ్డాగా ఉంది.

◆ కళలకు ఊపిరి పోస్తున్న త్యాగరాయ గానసభ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, నగర కేంద్ర గ్రంథాలయం, రామకృష్ణ మఠం ఇక్కడే ఉన్నాయి.

◆ డీబీఆర్ మీల్స్, ప్రాగా టూల్స్, భోలక్‌పూర్ తోళ్ల పరిశ్రమ, వీఎస్‌టీ, గోల్కొండ, చార్మినార్ సిగరేట్ కార్మాగారాలు ఇక్కడే కొలువుదీరాయి. ప్రపంచానికే వ్యాక్సిన్ అందించే బయోలాజికల్ ఇవాన్స్ (బీఈ) కంపెనీలు ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంతానికి సాక్షి భూతాలుగా నిలుస్తున్నాయి.

◆ సినీ వినోదానికి కేరాఫ్ అడ్రస్ మన ఆర్టీసీ క్రాస్ రోడ్స్. అందమైన ట్యాంక్‌బండ్, సుందరమైన ఇందిరాపార్కు మన ముషీరాబాద్ సొంతం.

◆ ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లను తయారు చేసే అనేక పోటీ పరీక్షలకు తర్ఫీదును అందించే అశోక్‌నగర్ మన ముషీరాబాద్ నియోజకవర్గంలో ఉండటం గర్వకారణం.

◆ ముషీరాబాద్ చేపల మార్కెట్, తెలంగాణ ఆర్టీసీ బస్‌భవన్, దాని పక్కనే మూడు బస్‌డిపోలు ముషీరాబాద్‌కు ఐకాన్‌లుగా గుర్తింపు తెచ్చుకున్నాయి.

◆ 6 అనాల కూలీగా ఉండి కార్మిక నాయకుడిగా ఎదిగిన దివంగత ముఖ్యమంత్రి టి.అంజయ్య మన ముషీరాబాద్ బిడ్డ కావడం విశేషం. ఆయన లాంటి ఉద్దండుల్ని ఓడించి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నాయిని నర్సింహ్మారెడ్డి కూడా ముషీరాబాద్‌కే పెద్ద దిక్కుగా నిలిచారు.

◆ బండారు దత్తాత్రేయ సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించి కేంద్రమంత్రి, గవర్నర్ వరకు ఎదిగారు.

◆ డాక్టర్ కె.లక్ష్మణ్ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి బీజేపీలో జాతీయ స్థాయి నాయకుడిగా కొనసాగుతున్నారు.

◆ ఆర్టీసీ ఉద్యోగిగా ప్రస్థానం మొదలు పెట్టి నేడు ముషీరాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన ముఠా గోపాల్ కూడా ముషీరాబాద్ బిడ్డే.

◆ ఇక రాంనగర్ కుట్ర కేసు, ఇందిరావికాస్ పత్రాలు, పరిటాల రవి హక్కు కేసు నిందితుడు మొద్దు శ్రీను, గ్యాంగ్‌స్టార్ అజీజ్‌రెడ్డి వంటి చరిత్రలో నిలిచిపోయే కేసులు కూడా మన ముషీరాబాద్‌లోనే జరిగాయి.

◆ ఇటీవల రూ.426 కోట్లతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జి ఆసియా ఖండంలోనే మొట్టమొదటిది కావడం కూడా విశేషం.

గడపగడపను తాకండి

బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్సీ ప్రభాకర్ దిశానిర్దేశం



మాట్లాడుతున్న ముషీరాబాద్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ ప్రభాకర్, ముఠా గోపాల్

ముషీరాబాద్: నియోజకవర్గంలోని ప్రతి గడపను తాకాలని, ప్రతి వ్యక్తిని కలవాలని ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ ప్రభాకర్ బీఆర్ఎస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్ ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, ప్రజాసంఘాల నాయకులు, సీనియర్ నాయకులతో కలిసి ఆర్యవైశ్య హాస్టల్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ నాయకులను ఇన్‌చార్జ్‌గా వచ్చిన ఎమ్మెల్సీ ప్రభాకర్ పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్, ప్రభాకర్‌లు మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం ఎత్తుగడలపై చర్చించారు.

◆ బూత్ కమిటీల నిర్మాణం పటిష్టంగా జరగాలని ఎన్నికల్లో గెలిపించేది బూత్‌స్థాయి నాయకులే అని స్పష్టం చేశారు.

◆ బూత్‌లలో ఓటర్ల సంఖ్య బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నారనే విషయాన్ని గుర్తించి వారిని ఓటు వేయించే బాధ్యత తీసుకోవాలని కోరారు.

◆ గత 10 ఏళ్లలో సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలని ముఖ్యంగా లబ్ధిదారులను గుర్తించి వారిని పార్టీకి అనుకూలంగా మలుచుకోవాలని కోరారు.

◆ ఎమ్మెల్యే ముఠా గోపాల్ చేసిన అభివృద్ధి, సహాయాలు కూడా వారికి వివరించి ప్రభుత్వానికి అనుకులంగా మలచుకోవాలని కోరారు.

◆ పార్టీ నాయకుల మధ్య ఉన్న వ్యక్తిగత ద్వేషాలు, మనస్పర్థలను ఈ రెండు నెలలు పక్కనపెట్టాలని సూచించారు.

◆ రెండోసారి ముషీరాబాద్ నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేసి బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌ను ఘన విజయం సాధించే విధంగా కృషి చేయాలని, మూడోసారి సీఎంగా కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టేలా చూడాలని కోరారు. ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, వివిధ డివిజన్ల అధ్యక్షులు వై.శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్‌ప్రసాద్, రాకేష్, ముక్తార్‌హుస్సేన్, కొండపల్లి మాధవ్, శ్యామ్‌సుందర్, రావులపాటి మోజెస్, వల్లాల శ్యామ్‌యాదవ్, శ్రీనివాస్‌గుప్తా, జనార్దన్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులున్నారు.

జంగ్ తెలంగాణ 2023

కామధేనువుగా అమ్మవారి అలంకరణ



శారదాంబ అమ్మవారి దర్శనం



శమీపూజలో పాల్గొన్న మహిళలు

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో శారదా శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజున అమ్మవారు కామధేనువు అలంకరణలో దర్శనమిచ్చి భక్తులకు కనువిందు చేసింది. సోమవారం సాయంత్రం విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కొమండూరి శేషాద్రి బృందం ప్రదర్శించిన 'త్రిముఖ వయోలిన్ కచేరి' ఆహుతులను అలరించింది.

◆ న్యూనల్లకుంటలోని శ్రీ సీతారాంమాంజనేయ సరస్వతి ఆలయంలో సరస్వతి మాత రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. సాయంత్రం నిర్వహించిన శమీపూజలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ వై.అమృత పాల్గొన్నారు.

◆ గ్రీన్ రిచ్ రెసిడెన్సీలో సోమవారం సాయంత్రం విజయ దశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఘనంగా దసరా వేడుకలు

- రావణ దహనం
- వేడుకల్లో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్‌లో సోమవారం రాత్రి దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాల్చి రావణదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు, ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

షిండే కుటుంబాన్ని పరామర్శించిన వినోద్‌కుమార్



సాక్షి,సిటీబ్యూరో: లక్డీకాపూల్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మరాఠా మండల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఏసీపీ ఎల్‌కే షిండే కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ మంగళవారం పరామర్శించారు. బర్కత్‌పురా ప్రాంతంలోని వారి నివాసానికి వెళ్లి షిండే భార్య అరుణా షిండే, కుమారుడు సమీర్ షిండే, ఇతర కుటుంబసభ్యులను వినోద్కుమార్ ఓదార్చారు. షిండే ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో 38 ఏళ్ల పాటు మరాఠా సంఘం దశాబ్దాలుగా షిండే చేసిన సేవలను వినోద్ కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం మరాఠా మండల్, రాష్ట్రానికి తీరని లోటని పేర్కొన్నారు. మరాఠా మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్ పాటిల్, ఉపాధ్యక్షులు మదన్జాదవ్, నివాస్ నికం, క్రిస్టియన్స్ సంఘం రాష్ట్ర నాయకులు థామస్ జాన్ తదితరులున్నారు.

ముఠా జైసింహకు శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న ముఠా గోపాల్, సోమ సుందర్ తదితరులు



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

ముషీరాబాద్: బీఆర్ఎస్ యువజన నాయకులు, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహ జన్మదిన వేడుకలు మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు చోట్ల ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నాయకులు సోమ సుందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో కేక్‌కట్ చేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, నర్సింగ్ ప్రసాద్, ఆకుల అరుణ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్ చారి, శివముదిరాజ్, టెంట్‌హౌజ్ శ్రీనివాస్, బల్లా ప్రశాంత్, లక్ష్మణ్‌గౌడ్, పరశురామ్‌యాదవ్, సదా, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కవాడిగూడ: బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు కల్వనితిష్ ఆధ్వర్యంలో దోమలగూడలో మంగళవారం టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వికలాంగుల చట్టం ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగుల పరిరక్షణ చట్టం 2016 ప్రకారం దివ్యాంగులకు వివిధ రాజకీయ పార్టీలు రిజర్వేషన్ కల్పించాలని 'డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్' జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రంలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో తమకు కూడా పోటీచేసే అవకాశం ఇవ్వాలని, ఆయన రాజకీయ పార్టీలను కోరారు. రాష్ట్రంలో ఉన్న 20 లక్షల మంది దివ్యాంగుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తేందుకు మాకు అవకాశం ఇవ్వాలని కోరారు. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించకపోవడం వల్లే మాకు అన్ని విధాలుగా నష్టం జరుగుతుందన్నారు. రాజస్థాన్ తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మాకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ కో- కన్వీనర్ భారతి, కాటమోని వెంకటేష్‌గౌడ్, హబీబ్, గౌస్ తదితరులున్నారు.

'బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం'



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, నందుకుమార్

అబిడ్స్: బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. దసరా సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రగతి, అభివృద్ధితోనే బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఎంత అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సాయిబాబా 105వ పుణ్యతిథి



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో సాయిబాబా 105వ పుణ్యతిథి (మహాసమాధి) మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, కాకడ హారతి, అనంతరం సాయిబాబా మూల విరాట్‌కు అభిషేకం (మంగళ స్నానం) కావించి బాబాకు విశేష పూజలు చేశారు. అనంతరం పేదలకు నిత్యాన్నదానం, సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శమీపూజ చేశారు. అనంతరం సాయిబాబాకు 105 దీపాలతో అలంకరణ చేశారు. 7 గంటలకు సాయిబాబా రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. ఈ సందర్భంగా పుర వీధుల్లో ఊరేగుతూ.. వచ్చిన సాయినాథుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం భజన కార్యక్రమం కొనసాగింది.

నేడు శ్రీసాయి సచ్చరిత్ర పఠనం..

మహోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం సాయిబాబాకు అభిషేకం ఉంటుందని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు ప్రకటించారు. అనంతరం శ్రీ సాయి సచ్చరిత్ర పఠనం ఉంటుందన్నారు. సాయంత్రం 8.30 గంటలకు సాయిబాబాకు ఊయలసేవ, అనంతరం శేజ్ హారతితో కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు.

సోమేష్‌కుమార్‌ను కలిసిన బీసీ నాయకులు



సన్మానిస్తున్న వి.కృష్ణమోహన్ తదితరులు

లిబర్టీ: సీఎం కేసీఆర్ ముఖ్య సలహాదారులు ఎం.సోమేష్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్‌రావు, బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి మంగళవారం కలిశారు. విజయదశమి సందర్భంగా వారు సోమేష్‌కుమార్‌ను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆత్మీయ సత్కారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నగర రాష్ట్ర అభివృద్ధి కోసం సోమేష్‌కుమార్ ఎంతగానో కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన సేవలను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి వినియోగించుకోవాలని సంకల్పంతో సీఎం చీఫ్ అడ్వైజర్‌గా సోమేష్‌కుమార్‌ను నియమించడం అభినందనీయమన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రజా సంక్షేమం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని సోమేష్ వారికి హామీ ఇచ్చారు.

'మన ఓట్లు మన సీట్లు' నినాదంతో ముందుకెళ్తున్నాం

లిబర్టీ: మన ఓటు మన సీట్లు అన్న నినాదంతో దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపాలని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ నల్ల సూర్య ప్రకాష్ కోరారు. విడిపోతే పడిపోతాం కలిసి ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చని ఆయన నొక్కి చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆలోచన విధానంతో గౌతమ బుద్ధిని తాత్విక వెలుగులో బహుజన సమతా రాజ్యాన్ని నిర్మించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సంఘటితమై ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఎంసీపీఐ నాయకులు ఎం.మార్టిన్ మాట్లాడుతూ.. దళిత బహుజనులు ఐక్యంగా ఉండి బీఎల్ఎఫ్ అభ్యర్థుల విజయం కోసం పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం కీలకంగా మారిన ఎన్నికల నేపథ్యంలో విజయం తీరాలకు చేరాల్సిన అవసరం ఉందన్నారు.

బహుజనులు రాజ్యాధికారంలోకి రావాలి

లిబర్టీ: అంబేడ్కర్ ఆలోచన విధానంతో గౌతమ బుద్ధుని తాత్విక వెలుగులో దళిత బహుజన రాజ్యాన్ని నిర్మిస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణస్వరూప్ అన్నారు. సమతా రాజ్యాంగ నిర్మాణం కావాలంటే దళిత బహుజనులను చట్ట సభల్లోకి పంపాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బు, మద్యం, దళిత బహుజనులు అమ్ముడుపోకుండా 'ఓట్లు మావే సీట్లు మావే' అన్న నినాదంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటు పడతానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్ అస్రఫ్ నగర్ కాలనీవాసులతో మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎల్లప్పుడు ముందుంటానని చెప్పారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి శాయశక్తుల కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ మాట్లాడుతూ, డివిజన్‌లో రోడ్లు, పార్కులు అభివృద్ధి చేశామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరణ చేశామన్నారు. సమావేశంలో కాలనీవాసులు, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు నల్ల శివమాదిగ ఆధ్వర్యంలో దళిత సంఘాల నేతలు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి విన్నవించారు. గృహలక్ష్మి, దళితబంధు, డబుల్ బెడ్రూంలతోపాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల కేటాయింపులో మాదిగలకు పథకాలు సరిగ్గా అందలేదని ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం ఉన్న దళిత వర్గాలకు ఈ పథకాలు సమపాళ్లలో కేటాయించలేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వారు కోరారు.

గాజా ప్రజలకు మద్దతుగా మౌన ప్రదర్శన



చార్మినార్: గాజా విల్ నెవర్ డై..స్టాప్ బాంబింగ్ ఆన్ గాజా..లాంగ్ లివ్ పాలస్తీన్..అంటూ కొంత మంది ముస్లింలు మంగళవారం ప్ల కార్డులు పట్టుకొని మౌన నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనా గాజా ప్రజలకు అండగా ఉండాల్సిన సమయం వచ్చిందని..వారికి మానసిక స్థైర్యాన్ని కల్పించడం కోసం తాము చార్మినార్ వద్ద ఈ ప్రదర్శన చేపట్టామని సిటిజన్స్ కన్సర్న్‌డ్ ఆఫ్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తెలిపారు. చార్మినార్ వద్ద జరిగిన ఈ నిరసన ప్రదర్శన సమాచారం చార్మినార్ ఏసీపీతో పాటు స్థానిక పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

వ్యక్తి అదృశ్యం

అబిడ్స్: ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉస్మాన్‌గంజ్ రిసాలాబ్దుల్లాలో నివసించే అనిల్‌కుమార్ కత్రి (30) స్టేషనరి వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 20వ తేదీ రాత్రి తన సెల్‌ఫోన్ మరమ్మతు కోసం అబిడ్స్ జగదీశ్‌మార్కెట్‌కు వెళ్లిన అనిల్‌కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం తండ్రి ఓంప్రకాష్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ.శైలజ పేర్కొన్నారు.

నిమ్స్‌లో అన్నదానం

లక్డీకాపూల్: చెడు మీద మంచి సాధించిన విజయానికి దసరా చిహ్నమని పలువురు వక్తలు అన్నారు. నిమ్స్ ఆసుపత్రిలో 4 రోజుల పాటు వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జరిగాయి. ఈ క్రమంలో నిమ్స్ సెక్యూరిటీ కార్యాలయంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగర బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యానారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎన్. లక్ష్మీభాస్కర్, కేవీ.కృష్ణారెడ్డి తదితరులున్నారు.